ఓయూ అధ్యాపకుల అభినందనలు

రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముత్తినేని వీరయ్యను ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ టి. రామకృష్ణ నేతృత్వంలో గణిత విభాగం పూర్వవిద్యార్థులు సన్మానించారు. వీరయ్య ఓయూ గణిత విభాగం పూర్వ విద్యార్థేనని గుర్తు చేసుకున్నారు. వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయనను కోరారు. – ఉస్మానియా యూనివర్సిటీ

బొగ్గు గనులను వేలం వేయొద్దు

ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అడ్డగుట్ట, జూలై 10 : దేశవ్యాప్తంగా జూలై 10న కార్మికుల కోరికల దినంగా పాటించాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ నాయకులు అజయ్‌బాబు అన్నారు. సీఐటీయూ పిలుపులో భాగంగా జూలై 10న కార్మికుల కోరికల దినంగా పాటించాలని తుకారాం గేట్, లాలాపేట, తార్నాక ప్రాంతాల్లో సీఐటీయూ కమిటీ సభ్యులను కలుపుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ... ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. బొగ్గు బ్యాగులను వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలని, సింగరేణికి నేరుగా గనులను కేటాయించాలని తెలిపారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించాలని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో నర్సింగ్, శంకర్, రామచందర్, అశోక్, సిద్దయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

'టిమ్స్'తో పేదలకు మెరుగైన వైద్యం

పనులను పరిశీలించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్

బొల్లారం,జూలై 10: బొల్లారంలోని టిమ్స్ దవాఖాన నిర్మాణ పనులను బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీ గణేష్ పరిశీలించారు.అనంతరం అధికారులతో నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపడుతున్న దవాఖాన నిర్మాణ పనులల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వచ్చే సంవత్సరం సెప్టెంబర్ నాటికి దవాఖాన నిర్మాణ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.ఈ దవాఖాన ద్వారా చుట్టు పక్కల ఉన్న జిల్లాల పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందునున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దవాఖాన 1200 పడకల దవాఖానగా నిర్మాణం చేపడుతున్నారని,ప్రజలకు మరింత సదుపాయంగా ఉండేందుకు 1400 పడకలకు పెంచే విధంగా స్థానిక ఎమ్మెల్యేగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు జయ ప్రకాష్,సీనియర్ నాయకులు నరసింహన్, బాల్‌రాజు,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో టిమ్స్ దవాఖాన నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

డ్రగ్స్ రహిత తెలంగాణే.. ప్రభుత్వ ధ్యేయం

డ్రగ్స్‌పై రూపొందించిన పోస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతా శ్రీలతా శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 10: తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని జామై ఉస్మానియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం – సమాజాన్ని మేలుకొల్పుదాం'అనే పేరుతో కళాయాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ హాజరయ్యారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ఆమె అనంతరం కార్యక్రమంలో మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే చిన్నారుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ చెడు అలవాట్లు, డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా చూసుకోవాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాల మత్తులో పడకుండా వారి కెరీర్‌పై దృష్టి సారించాలని, కుటుంబాన్ని ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేసి, మరొకరికి స్ఫూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సమాచారం ఏ ఒక్కరికి తెలిసినా, పోలీసు విభాగానికి తెలపాలని కోరారు.

అమలు కాని వారు..దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ/అడ్డగుట్ట, జూలై 10: బౌద్ధనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ కంది శైలజ బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 కే వంట గ్యాస్ వంటి పథకాలు అమలు కాని వారు వెంటనే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా వార్డు కార్యాలయాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు దరఖాస్తుల స్వీకరణ జరుగుతున్న తీరును అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత గంటా రాజుసాగర్ మాట్లాడుతూ...వార్డు కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారు లు, కాంగ్రెస్ నేతలు గంటా రాజుసాగర్, మందా ప్రభాకర్, లక్ష్మి, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తులపై అధికారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

నేటి నుంచి తార్నాకలో..

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 10: తార్నాక డివిజన్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం నుంచి నిర్వహించనున్నట్లు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌లోని లాలాపేట వార్డు కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలకు జీహెచ్ఎంసీ అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. డివిజన్ ప్రజలు ఏదైనా సమస్యలు ఉంటే వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వార్డు కార్యాలయం ఆకస్మిక తనిఖీ

సికింద్రాబాద్,జూలై 10: ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అధికారులను ఆదేశించారు. నామాలగుండు లోని వార్డు కార్యాలయాన్ని బుధవారం కార్పొరేటర్ హేమ ఆకస్మిక తనిఖీ చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ వార్డు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. 200 యూనిట్ల కరెంట్ ఉచిత విద్యుత్ రానివారు. వార్డు కార్యాలయంలో దరకాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావు, వార్డు కార్యాలయం ఇన్‌చార్జ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో జియో మాగ్నటిక్ సర్వే

ఓయూలో జియో మాగ్నటిక్ సర్వే నిర్వహిస్తున్న అధ్యాపకులు, స్టైగర్ సంస్థ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 10: ఉస్మానియా యూనివర్సిటీ జియోఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో జియో మాగ్నటిక్ సర్వేను విజయవంతంగా నిర్వహించారు. జియోఫిజిక్స్ రంగంలో అత్యాధునిక పరికరాలు, సమర్థత కలిగిన 'స్టైగర్ జియోసైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థతో ఉస్మానియా యూనివర్సిటీకి గతంలోనే అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం జియో మాగ్నటిక్ సర్వే నిర్వహించాలని అధికారులు ఆహ్వానించగా స్టైగర్ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో జియోఫిజిక్స్ విభాగం ఎదురుగా ఈ సర్వేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొని పరిశోధనా రంగంలో అందుబాటులో ఉన్న అత్యాధునిక పరిజ్ఞానం గురించి తెలుసుకున్నారు.

జియోఫిజిక్స్, ఎర్త్‌సైన్స్ విద్యార్థులకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు వివరించారు.

తలసాని శంకర్ యాదవ్ సేవలు మరువలేనివి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



మోండా మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి, జూలై 10: బోయిన్‌పల్లి, మోండా మార్కెట్‌లోని కార్మికులు, వర్తకులకు ఎలాంటి సమస్య తలెత్తినా వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేసిన వ్యక్తి తలసాని శంకర్ యాదవ్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం మోండా మార్కెట్ జనరల్ సెక్రటరీ మధు ఆధ్వర్యంలో శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు నాయకులు, వ్యాపారులు శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో శంకర్ యాదవ్ సోదరులు తలసాని నర్సింగ్ యాదవ్, మహేష్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, కుమారుడు శివలాల్ యాదవ్, మోండా మార్కెట్ జనరల్ సెక్రటరీ మధు, నాయకులు ఆకుల హరికృష్ణ, నాగులు, రాములు, శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, కిశోర్ కుమార్, లక్ష్మీపతి, శేఖర్, జయరాజ్, మహేష్ యాదవ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి: అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషకుమారి ఇంట విషాదం చోటు చేసుకుంది. తన సమీప బంధువు, వియ్యంకుడు వెంకటేశ్వర శర్మ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఉదయం సనత్‌నగర్ మోడల్‌కాలనీలోని వారి ఇంటికి చేరుకుని మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. –అమీర్‌పేట్, జూలై 10

సులభమైన ప్రయాణం కోసం..

అమీర్‌పేట్, జూలై 10 :భారతదేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను కలుపుతూ రైల్వే మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన భారత్ గౌరవ్ రైల్ ప్రజలు కోరుకుంటున్న సులభమైన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. తీర్థ, పర్యాటక యాత్రలు చూసే వారికి భారత్ గౌరవ్ రైల్ సమగ్ర సమాచారంతో పాటు అన్ని సదుపాయాలను అందుబాటులోకి తెస్తూ టూర్ టైమ్స్ సంస్థ సౌత్ స్టార్ లైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో కస్టమర్ కేర్ సెంటర్‌ను యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌చైర్మన్ కిషన్‌రావు బుధవారం సాయంత్రం బేగంపేట్‌లోని పర్యాటక భవన్‌లో కస్టమర్ కేర్ సెంటర్ ప్రారంభించారు. వచ్చే నెల 7 నుండి ప్రారంభమయ్యే భారత్ గౌరవ్ రైల్‌కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ తెలుగు రాష్ట్రాల బిజినెస్ హెడ్ రమేష్ అయ్యంగార్ తెలిపారు.

పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, లా విభాగంలో పీజీ డిప్లొమా కోర్సుల మొదటి, రెండో సెమిస్టర్, ఎల్ఎల్ఎం తదితర కోర్సుల ఫలితాలు విడుదల చేశారు. ఫలితాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

పలు కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 15 లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలి. రూ.300 అపరాధ రుసుముతో18వ తేదీ వరకు చెల్లించవచ్చు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ బ్రిడ్జి కోర్స్ రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 15 లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నారు.

బీఈ కోర్సులకు వన్‌టైం చాన్స్..

ఓయూ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు అధికారులు తెలిపారు. 2వేల సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును ఈ నెల 15 లోపు, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 19వ తేదీలోపు కళాశాలల్లో చెల్లించాలి. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాలి. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే పరీక్షలకు హాజరుకావాలి.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను అధికారులు ఖరారు చేశారు. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 16 నుంచి, ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను 23 నుంచి, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, నాలుగో సెమిస్టర్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నారు.

దూరవిద్య పీజీ పరీక్షలు వాయిదా

ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే అన్ని పీజీ కోర్సుల పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ వాటిని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను తిరిగి నిర్వహించబోయే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని, వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

గాంధీ దవాఖానలో డ్రైనేజీ పనులు ప్రారంభం

15.5 కోట్లతో పనులు ప్రారంభించిన సూపరింటెండెంట్ రాజారావు

బన్సీలాల్‌పేట్, జూలై 10 : గాంధీ దవాఖానలో రూ.15.5 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన డ్రైనేజీ పైపులైన్లు, మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళన పనులను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు ప్రారంభించారు. గాంధీ దవాఖాన భవనం 2004లో నిర్మించారు. వినియోగం ఎక్కువ కావడంతో పైపులైన్‌లు శిథిలావస్థకు చేరాయి. డ్రైనేజీ పైపులైన్‌లు పూర్తిగా పాడైపోయాయి. ముందుచూపు లేక సెల్లార్‌లో మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేయడం వలన వర్షాలు పడినప్పుడు, డ్రైనేజీలు నిండిపోయినప్పుడు దవాఖాన సెల్లార్ మొత్తం మురుగు నీటితో నిండిపోతున్నది.

భవనం నలువైపులా ఎటు చూసినా పాకురుపట్టిన పైపులైన్‌లు కనిపిస్తున్నాయి. అనేక వార్డులలో ఉన్న 750 టాయిలెట్‌లలో పైపులు పగిలిపోయి, టైల్స్ విరిగిపోయి, మరుగుదొడ్డి సామగ్రి పాడైపోయాయి. రోగులకు కలుగుతున్న ఇబ్బందులను, నిర్వహణాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ వివరిస్తూ గాంధీ దవాఖాన పరిపాలన విభాగం అధికారులు గత ప్రభుత్వ హయాంలో దవాఖాన సందర్శనకు వచ్చిన ఆనాటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. భవనాలను స్వయంగా పరిశీలించిన ఆయన వెంటనే నూతన డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందించాలని టీఎస్ఎంఎస్ఐడీసీని ఆదేశించారు. నూతన మురుగునీటి వ్యవస్థ సంపూర్ణ ఏర్పాటుకు రూ.13.5 కోట్లు వ్యయం అంచనా వేయగా వెంటనే మంజూరు చేశారు. ఆ మేరకు ఆన్‌లైన్‌లో టెండర్‌లను ఆహ్వానించినా కాంట్రాక్టర్‌లు ముందుకు రాలేదు. దాంతో ఇటీవల మరోసారి రూ.19.5 కోట్లకు వ్యయాన్ని పెంచి ప్రతిపాదనలు పంపించారు.

కొత్త ప్రభుత్వం రూ.15.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. సాంకేతిక ప్రక్రియలు పూర్తి కావడంతో ఎట్టకేలకు పనులు మొదలుకావడం సంతోషకరమని డాక్టర్ రాజారావు అన్నారు. ఆరు నెలల్లోగా పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని టీజీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్.చలపతిరావు, డిప్యూటీ ఈఈ ఎం.అనిల్ కుమార్ తెలిపారు.

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

బ్రాహ్మణ బస్తీలో కార్పొరేటర్ పర్యటన

బ్రాహ్మణబస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్,జూలై 10 : ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో కలిసి పరిష్కరిస్తామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ బస్తీలో స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ హేమ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు తాగునీరు కలుషితం అవుతుందని ,అలాగే వాటర్ ప్రెషర్ తక్కువగా వస్తున్నాయని తెలిపారు.సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రియాంకను కార్పొరేటర్ హేమ ఆదేశించారు . నూతన సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కోరగా స్పందించిన కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సిబ్బంది శ్రీకాంత్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

మారేడ్‌పల్లి, జూలై 10: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ...సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న సికింద్రాబాద్ సంచాలన్ భవన్ ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించన్నునట్లు మజూర్ యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జి. ఉదయ్ భాస్కర్ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...పాత పెన్షన్ విధానం కోసం 2004 సంవత్సరం నుంచి పోరాటం చేస్తున్నామని, కానీ రైల్వే బోర్డు గానీ, కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించలేదన్నారు. ఏఐఆర్ఎఫ్ అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను ఆహ్వానించి 2023 సంవత్సరంలో జేఎఫ్ఆర్ఓపీఎస్‌ను ఏర్పాటు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ ప్రెసిడెంట్ ఖాజా బాబా, డివిజనల్ సెక్రటరీ రవీందర్, కార్యదర్శులు కె . అంజయ్య, వినాయకరావు, బ్రాంచ్ చైర్మన్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

ఏర్పాట్లపై ఆరా..! బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు, భద్రతపై అధికారులతో కలిసి సమీక్షిస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

'ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 10: నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డిలతో సమావేశమైన ప్రతినిధులు ప్రతీవారం జరిగే మార్కెట్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించాలని కోరారు. బయో వ్యర్థాలను కంపోస్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో పుట్‌పాత్‌లు లేక పోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను డిప్యూటీ మేయర్ ఆదేశించగా, అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that my clients **No.1. Mr. MOHAMMED MONTAJUL MALIDA** S/o Mr. SIRAJ MALIDA, & **No.2. Mr. MOHAMMED INTAJUL MALIDA** S/o Mr. SIRAJ MALIDA, Both are HNo. 2-3-450/451, SRI SAI RESIDENCY ROOM No. 406, 4th FLOOR, BLOCL C NALLAGUTTA, RAMGOPALPET, SECUNDRABAD, TELANGANA STATE are Inter to Agreement Of Sale Paid the Advance amount purchase the Property **House bearing HNo.4-6-160, & Corresponding GHMC No. 4-6-160/C, admeasuring 125.00 Square Yards or 104.61 Square meters, Situated at Pan Bazar, Secunderabad, Hyderabad, Telangana State** with the Owner **No.1. Mr. PRADEEP KANSARA** S/o LATE. PRANLAL KANSARA & **No.2. Mr. SANJAY KANSARA** S/o LATE. PRANLAL KANSARA, Both are R/o Secundrabad, Telangana State. If any person(s) having any right, interest or claim over the said property may contact the undersigned within (07) days from the date hereof with relevant documents, failing which sale deed would be executed and objections if any, received thereafter will not be entertained and deemed to have been waived.

Dt: 10/07/2024

T.D.S. Associates.
(C/O DHIRENDRA SINGH Advocate)
MOHAMMED SHUJAUDDIN @ WASEEM SHOP No.5-6-3/24, MIM BUILDING DARRUSALAM, AGHAPURA, HYD.T.S. **9490932931, 9490467867**